

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

20 సెప్టెంబర్ 2025 పేజీలు : 08 శనివారం

## జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నూతన ఎస్పీగా బాధితుల స్వీకరించిన డాక్టర్ అజితా వేజెండ్ల శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్‌ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఇరువురు కొద్దిసేపు జిల్లాలోని పలు విషయాలు గూర్చి సంభాషించుకున్నారు.

## మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డికి మధ్యంతర బెయిల్ మంజూరు

**కావలి, మేజర్‌న్యూస్ :**



కావలి పట్టణంలో ఇటీవల ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిపై హత్యా ప్రయత్నం జరిగింది. దీనిపై కేసు నమోదైంది. ఈ కేసుపై మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డికి హైకోర్టులో బెయిలు పిటీషన్ వేయగా, విచారించి నాలుగు వారాలు మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. కావలి నియోజకవర్గం ప్రజలు తమ నాయకునికి బెయిల్ మంజూరు కావడంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు.

### ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన

## సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

### సమాజానికి అంకితభావంతో సేవలందిస్తున్న కాకర్ల సురేష్‌పై సీఎం ప్రశంసలు

**జలదంకి, మేజర్‌న్యూస్ :**





ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలసి వారి ఆశీస్సులను అందుకున్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి ముఖ్యమంత్రి చంద్ర బాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రజాసేవలో అంకితభావంతో, అభివృద్ధి పట్ల కట్టుబాటుతో, సమాజంలోని ప్రతి వర్గాన్ని సమానంగా ఆదరిస్తూ, రాజకీయ రంగంలో విశేష కృషి చేస్తున్న కాకర్ల సురేష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అలంకరించాలని, ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరచాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆశీర్వదించారు. ఉదయగిరి ప్రజలకు ఎల్లప్పుడూ చేరువగా ఉండి, సేవా తత్పరతతో నిలిచిన సురేష్ రాజకీయరంగంలో శిఖరాగ్ర స్థానాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. మంత్రి లోకేష్‌ను కలిసి ఆశీస్సులు పొందారు.

## రైతాంగ సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



- వందేళ్లకు పైబడ్డ కనిగిరి రిజర్వాయర్ క్రస్ట్ గేట్లను మార్చండి
- రిజర్వాయర్ మట్టికట్టను బలోపేతంతో పాటు పూడిక తీయుటకు నిధులు కేటాయించండి
- పెన్నానది కరకట్టలు బలోపేతం చేసి కోవూరు నియోజకవర్గాన్ని వరద ముప్పు నుంచి కాపాడండి
- ఆయుకట్టు పరిధిలోని చివరి ఎకరాకు నీరు చేరేలా ఈస్టన్, సదరన్, పైడేరు ఎస్కేప్ ఛానల్స్ మరమ్మతులు చేపట్టండి
- పల్లిపాడు గాంధీ ఆశ్రమాన్ని వరద కోత నుంచి కాపాడండి
- శాసనసభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

కనిగిరి రిజర్వాయర్ ఆధునీకరణకు నిధులు కేటాయించి కోవూరు, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల రైతంగాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. శుక్రవారం జరిగిన శాసనసభ సమావేశాలలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. 130 ఏళ్ల క్రితం 4.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన కనిగిరి రిజర్వాయర్లో దశాబ్దల తరబడి పూడిక తీయని కారణంగా వాటర్ స్టోరేజ్ కెపాసిటీ 2.5 టీఎంసీలకు పడిపోయిందన్నారు. సరైన మెయింటెనెన్స్ లేక క్రస్ట్ గేట్లు తుప్పు పట్టి రిజర్వాయర్‌లో నీళ్లు వృధాగా పోతున్నాయని ఆమె అసెంబ్లీలో ప్రస్తావించారు. కోవూరు, ఆత్మకూరు,కావలి నియోజకవర్గాలలోని 1 లక్షా 30 వేల ఎకరాలకు సాగునీరు అందించే కనిగిరి రిజర్వాయర్‌ను ఆధునికరించి డెల్టా ప్రాంత రైతులను ఆదుకోవాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెన్నానది పరివాహక ప్రాంతంలో ఉన్న కోవూరు నియోజకవర్గంలో చాలా చోట్ల పెన్నా పొర్లుకట్టలు చాలా బలహీనంగా ఉన్నాయన్నారు. 2021లో పెన్నా నదికి వచ్చిన వరదల సమయంలో కోవూరు నియోజకవర్గం 75 శాతం నీట మునిగి వరి, ఆక్వా రైతులు కోట్ల రూపాయలు నష్టపోయిన -మిగతా 2లో

## వేగవంతంగా భూసేకరణ

- పరిశ్రమల రాకతో పెరగనున్న ఉపాధి అవకాశాలు
- గుడ్లూరులో పరిశ్రమల హబ్
- కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**


కందుకూరు డివిజన్ గుడ్లూరు మండలం చేవూరు గ్రామం కొత్త పారిశ్రామిక విప్లవానికి సాక్ష్యంగా మారబోతోంది. ఇక్కడ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం వేగవంతంగా భూసేకరణ చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.

మిగతా 2

## అధికారుల తీరు మారకపోతే పోరాటం చేస్తాం

### మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**



అధికారుల తీరు మారకపోతే జిల్లాలోని సర్పంచులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో కలిసి జిల్లా అధికారుల పక్షపాత వైఖరికి నిరసిస్తూ పోరాటం చేస్తామని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పంచాయతీ కార్యాలయానికి సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వెళ్లి, వారిపై జరుగుతున్న వేధింపులు, ప్రోటోకాల్ ఉల్లంఘన, వివిధ అంశాలపై జిల్లా పంచాయతీ -మిగతా 2లో

## పరిశ్రమల స్థాపనకు కోవూరు నియోజకవర్గం

# అనుకూల ప్రాంతం



- రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కోసం మంత్రి లోకేష్ కృషి అభినందనీయం కోవూరులో పరిశ్రమల స్థాపనకు చేయూతనివ్వండి
- ఇఫ్కో సెజ్ లో పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించండి
- రైతుల నుంచి భూములు సేకరించి పరిశ్రమలు స్థాపించని సంస్థలపై చర్యలు తీసుకోండి
- శాసనసభ సమావేశాలలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు నియోజక వర్గంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన వేలాది ఎకరాల భూములతో పాటు పోర్టు, నేషనల్ హైవే, రైలు మార్గం లాంటి మౌలిక సదుపాయాలకు కొదవ లేదని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శుక్రవారం శాసనసభలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. కోవూరు నియోజక వర్గ పరిధిలో షుగర్ ఫ్యాక్టరీ భూములను ఎంఎస్ఎంఈ పార్క్‌గా మార్చితే స్టార్టప్, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన కృషి అభినందనీయమన్నారు. నాడు ఉమ్మడి జిల్లాలో శ్రీసిటీ, విశాఖపట్నం ఐటి, ఫార్మా, అనంతపురంలో కియా, నెల్లూరు జిల్లాలో గమేశా లాంటి పరిశ్రమలతో పాటు ఆంధ్రుల రాజధాని అమరావతిని ఐటి, ఇండస్ట్రియల్ డెవలెప్మెంట్ కోసం సిఎం చంద్రబాబు నాయుడు చేసిన కృషి భావితరాలకు ఆదర్శమన్నారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతి కోసం దేశ, విదేశాల నుంచి పరిశ్రమలు తీసుకొచ్చేందుకు మంత్రి లోకేష్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కోవూరు నియోజకవర్గంలోని ఇఫ్కో సెజ్‌లో ఉన్న 2 వేల 776 ఎకరాలలో నాడు చంద్రబాబు నాయుడు చొరవతో వచ్చిన విండ్ పవర్ ఫ్యాన్స్ తయారు చేసే గమేశా, కోకాకోలా యూనిట్స్ తప్ప ఇతర పరిశ్రమలు ఏవి రాలేదని, ప్రస్తుతం చంద్రబాబు నాయుడు పాలనలోనే ఇఫ్కో సెజ్‌లో పరిశ్రమలు వస్తాయని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇఫ్కో సెజ్‌లో పరిశ్రమల స్థాపన విషయంలో ఉన్న కొన్ని సాంకేతిక సమస్యలను పరిష్కరించి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరారు. కోవూరు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కొడవలూరు మండలంలో ఉన్న రాచర్ల పాడు బొడ్డువారి పాలెంలో ఉన్న ఏపీఐఐసీ పార్క్‌లో పరిశ్రమల కోసం భూములు కేటాయించి ఏళ్ళు గడుస్తున్నా ఇంకా పరిశ్రమలు ప్రారంభించని వారికి ఇచ్చిన అనుమతులు రద్దు చేసి వెంటనే పరిశ్రమలు నెలకొల్పే పారిశ్రామిక సంస్థలకు కేటాయించాలని ఆమె సూచించారు.

## రైతాంగ సమస్యలపై

## అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

*(మొదటి పేజీ తరువాయి)*

విషయాన్ని ఆమె సభ దృష్టికి తెచ్చారు. అప్పటి వరదల సందర్భంగా వంతెనలు కొట్టుకుపోయాయని గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చాలా గ్రామాలకు రాకపోకలకు అంతరాయంగా ఉందన్నారు. చారిత్రాత్మక పల్లిపాడు గాంధీ ఆశ్రమం వరద కోతకు గురైన సంఘటనను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. రానున్న వర్షాకాలంని దృష్టిలో పెట్టుకొని కరకట్టలు బలహీనంగా ఉన్న పెనుబల్లి, కోవూరు, ముదివర్తి ప్రాంతాలలో పెన్నానది పొర్లు కట్టలు బలోపేతం చేయాలని కోరారు. కనిగిరి రిజర్వాయర్ పూడిక తొలగింపు, బండ్ స్ట్రెంతనింగ్, గేట్ల రీప్లేస్‌మెంట్, అలాగే పెన్నా పరివాహక ప్రాంతంలోని కరకట్టల పటిష్టత పనులు తక్షణమే చేపట్టి కోవూరు ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించారు.

# వేగవంతంగా భూసేకరణ

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** కందుకూరు డివిజన్ గుడ్లూరు మండలం చేవూరు గ్రామం కొత్త పారిశ్రామిక విప్లవానికి సాక్ష్యంగా మారబోతోంది. ఇక్కడ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం వేగవంతంగా భూసేకరణ చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. మొత్తం 15,090 ఎకరాలు అవసరం కాగా, ఇప్పటి వరకు 1,875 ఎకరాల భూసేకరణ పూర్తయి పరిశ్రమల కోసం సిద్ధంగా ఉందని తెలిపారు.

**పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు :**

ఈ హబ్‌లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వంటి ప్రధాన పరిశ్రమలు స్థాపనకు సిద్ధమవుతున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా వేలాది ఉద్యోగాలు స్థానిక యువతకు లభించనున్నాయి. పరోక్షంగా అనేక ఉపాధి అవకాశాలు వ్యాపారాలు, రవాణా, సేవా రంగాల్లో ఏర్పడతాయి. ఇది కేవలం గుడ్లూరు మండలానికి మాత్రమే కాకుండా, మొత్తం జిల్లాకు ఒక పెద్ద ఆర్థిక బలం కలిగించనుంది.

**భూములు కోల్పోయిన వారికి భరోసా..**

పరిశ్రమల కోసం తమ భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందిస్తోంది. సంతృప్తికరమైన నష్టపరిహారం, పునరావాసం, పునరుద్ధరణ చర్యలతో భూములు ఇచ్చిన కుటుంబాలకు తగిన భద్రతతో పాటు భరోసా కల్పిస్తోంది.

**ప్రాంతీయ అభివృద్ధికి నాంది :**

ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త నాంది పలుకనుంది. రోడ్లు, విద్యుత్, నీరు వంటి మౌళిక వసతులు మరింత మెరుగుపడతాయి. దీనితోపాటు చిన్న చిన్న వ్యాపారాలు, స్టార్టప్ కంపెనీలు కూడా వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు లభించడం ద్వారా వారు పరిశ్రమల్లో ఎక్కువగా ఉద్యోగాలు పొందుటకు అవకాశాలు కలవు. చేవూరు గ్రామంలో ప్రారంభమైన ఈ భూసేకరణ భవిష్యత్తు తరాల కోసం ఒక అభివృద్ధి పథం. పరిశ్రమల రాకతో వేలాది కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు జీవనోపాదికి స్థిరపడతాయి. రైతులకు నష్టపరిహారం అందించడంతో పాటు, ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా ప్రభుత్వం సమగ్రాభివృదద్ధికి కృషిచేస్తోంది.

# వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలి

## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** వ్యవసాయాన్ని రైతుకు లాభసాటిగా చేయడమే లక్ష్యంగా వ్యవసాయ సంబంధిత అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖలైన హార్టికల్చర్, పశుసంవర్ధక, మైక్రో ఇరిగేషన్, సహకార, ప్రకృతి వ్యవసాయం, మత్స్యశాఖల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా పంపిణీపై మండలాల వారీగా రైతుల అవసరాలను గుర్తించి అందుకనుగుణంగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ప్రతి రైతుకు నిర్ణీత కార్డులను అందచేసి యూరియా పంపిణీ వివరాలను అందులో నమోదు చేయాలన్నారు. వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా రైతుల అవసరాలకు అనువైన యంత్రాలను గుర్తించాలని, యంత్రాల ఖరీదు, కూలీల ద్వారా అయ్యే ఖర్చు రెండింటిని బేరీజు వేసి రైతులకు అవగాహన కలిగించాలన్నారు. అలాగే యంత్రాల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. అదేవిధంగా సిసిఆర్ కార్డుల ద్వారా నిర్ణీత సమయంలోనే బ్యాంకు రుణాలు ఇప్పించాలన్నారు. మైక్రో ఇరిగేషన్ కు సంబంధించి ఈ సంవత్సరానికి నిర్దేశించిన 6000 హెక్టార్లకు సంబంధించిన అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్‌ను అక్టోబర్ మొదటివారం లోపు మంజూరు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపేలా మరింత కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, జిల్లా హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి, డిసిఓ గురప్ప, మత్స్యశాఖ జెడి శాంతి, పశుసంవర్ధక శాఖ జెడి రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు తీరు మారకపోతే పోరాటం చేస్తాం

*(మొదటి పేజీ తరువాయి)*

అధికారి ఎల్.శ్రీధర్‌రెడ్డితో మాట్లాడారు. సర్పంచులకు జిల్లా పంచాయతీ అధికారి ఇచ్చిన షోకాజులకు కాకాణి వివరణ అడిగారు. కరెంట్ బిల్లులు చెల్లించినా, చెల్లించిన మొత్తం నిధులు దుర్వినియోగం అయ్యాయని రాయడానికి మీకు మనసు ఎలా వచ్చిందని కాకాణి ప్రశ్నించారు. కాకాణి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. మా పార్టీ సర్పంచులపై నిందలు వేయవద్దు, మేమే రాజీనామాలు చేస్తామని కాకాణి అన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా సర్పంచులు అని కూడా చూడకుండా, దారుణమైన నిందలు వేస్తున్నారన్నారు. సర్పంచులకు కనీసం మర్యాద ఇవ్వకుండా, ప్రోటోకాల్ ఉల్లంఘన జరుగుతూ, ఫిర్యాదులు చేస్తున్నా, జిల్లా అధికారులు మౌనవ్రతం పాటించడం సరికాదన్నారు. మీడియా సమక్షంలోనే సర్పంచులు నిబంధనల మేర ఖర్చు చేసిన వాటికి కూడా, నిధుల దుర్వినియోగం కింద, అభ్యంతర ఖర్చుల కింద ఎలా రాశారని కాకాణి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సర్పంచులు, స్థానిక సంస్థల ప్రతినిధులపై కక్ష సాధింపులు ప్రారంభమయ్యాయని కాకాణి అన్నారు. జిల్లాలో సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధుల స్థానాలను 95 శాతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందని తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రజల మద్దతుతో గెలిచిన స్థానిక ప్రజాప్రతినిధులను తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకోవాలని కూటమి నేతలు బాహాటంగా వేధింపులకు పాల్పడుతున్నారన్నారు.

గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకోకపోతే చెక్ పవర్ రద్దు చేయడం, తొలగిస్తామని సర్పంచ్‌లను, స్థానిక ప్రజాప్రతినిధులను రకరకాల భయాందోళనలకు గురిచేస్తున్నారని కాకాణి అన్నారు. అధికారులు కూటమి నేతల కన్నుసన్నలలో మహిళా ప్రజా ప్రతినిధుల మనోభావాలు దెబ్బతీసే విధంగా అవినీతిపరులుగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వెంకటాచలంలో సర్పంచ్‌గా ఉన్న బీసీ మహిళను, వైకాపా నాయకుడు వెంకటశేషయ్యపై కక్షతో నిధులు దుర్వినియోగమయ్యాయని అభియోగం మోపి, విచారణ పేరుతో వేధిస్తున్నారని కాకాణి అన్నారు. బిల్లులు, రుజువులు చూపిస్తే అధికారులు నీళ్లు నమిలే పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. టిడిపి కండువా కప్పుకోకపోతే, చేసిన పనులకు బిల్లులు రావు, ఆస్తులు అమ్ముకొని గ్రామ అవసరాలు తీరుస్తున్న సర్పంచ్‌లపై అవినీతిపరులుగా ముద్ర వేయడం దారుణమన్నారు. అధికార పార్టీ నేతలకు అధికారులు కొమ్ముకాస్తున్నారు. గ్రామాలలో జరిగే అభివృద్ధి పనులకు అధ్యక్షత వహించాల్సిన సర్పంచ్‌లను, స్థానిక ప్రజాప్రతినిధులను తగిన గౌరవం ఇవ్వకుండా, అవమానపరుస్తూ, అధికారులు యథేచ్ఛగా ప్రోటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, ఏనాడు కూటమి పార్టీల ప్రజాప్రతినిధులపై కక్ష సాధింపులకు పాల్పడలేదని తెలిపారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఏ పార్టీకి చెందిన వారికైన గౌరవం ఇచ్చాం, వారిపట్ల హుందాగా నడుచుకున్నామన్నారు. శాసనసభ్యులు చీప్‌గా ఉంటే, పాలన ఎంత చీప్‌గా ఉంటుందో సర్వేపల్లి నియోజకవర్గంలో చూస్తే అర్థమవుతుందని కాకాణి అన్నారు. అధికారం శాశ్వతం కాదని అధికారులు గుర్తించుకోవాలని, అధికారులు చేసే పాపాలపై పునర్విచారణ చేపడుతాం, భవిష్యత్తులో మీకు అవి శాపాలుగా చుట్టుముడుతాయన్నారు. అధికార పార్టీ నేతల ప్రాపకం కోసం, దయదాక్షణ్యాల కోసం ఇష్టానుసారంగా వ్యవహరిస్తే, మూల్యం చెల్లించుకోక తప్పదని కాకాణి హెచ్చరించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను తొలగించాలనే ఉద్దేశంతో అవినీతిపరులుగా నిందలు మోపడం మనసును కలచివేస్తుందని కాకాణి అన్నారు.

# స్వస్థ నారి- సశక్తి పరివార్ అభియాన్



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 2 తేదీ వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా మహిళల సంపూర్ణ ఆరోగ్యం కొరకు స్వస్థ నారి- సశక్తి పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైనమహిళ- శక్తి వంతమైన కుటుంబం) ప్రత్యేక వైద్య శిబిరాలు ద్వారాకార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంయొక్క ముఖ్య ఉద్దేశం మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచడం, మహిళలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషకాహార పదార్థాలతో కూడిన ఆహారాన్ని తీసుకునే విధంగా ప్రోత్సహించడం, మహిళలను స్వశక్తివంతం చేయడం ద్వారా వారు తమ జీవనోపాధికి శక్తివంతంగా కృషిచేసి, వారి జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకునేందుకు దోహదపడుతుంది. ఈ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖతోపాటు ప్రజా సంబంధ నాయకులు, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, స్వచ్ఛంద సంస్థలు, వారు పాల్గొని విజయవంతం చేయాలి. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో మహిళలకు గుండె వ్యాధులు, మధుమేహం, రక్తపోటు, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయక్యాన్సర్ లను పరీక్షల ద్వారా గుర్తించి, రెఫరల్ సేవలు అందించడం ,కన్ను, చెవి, ముక్కు, గొంతు, దంతాలు సంబంధించిన పరీక్షలు చేసి చికిత్సలు ఇవ్వడం,మహిళలు, కిశోర్ బాలికలకు రక్తహీనతకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, రక్తహీనతతో ఉన్నవారికి చికిత్సలు నిర్వహించడం, గర్భిణీలు, బాలింతలుకు గర్భవతిగా ఉన్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, కాన్పు అయిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, అర్హులైన పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, ఎమ్ సి పి కార్డులు, పోషకాహారం గురించి అంగన్ వాడి కార్యకర్తలు వండిన వంటలు డిస్ప్లే చేసి, సమతుల్య ఆహారం గురించి, కిషోర్ బాలికలకు పీరియడ్స్ వచ్చే కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ,సికిల్ సెల్ అనీమియా, క్షయ వ్యాధి నిర్మూలన, మానసిక ఆరోగ్యం గురించి, బ్లడ్ డొనేషన్, అవయవ దానం గురించి అవగాహన, ఆయుష్మాన్ భారత్, పిఎంజెఏ వై, వయో వందన కార్డులు శిబిరానికి వచ్చిన మహిళలకు ఇవ్వడం, ఏబిహెచ్ఏ ఐడీలు లేని వారికి శిబిరంలో ఏబిహెచ్ఏ క్రియేట్ చేయడం, ఈ ప్రత్యేక వైద్య శిబిరాలు 19వ తేదీ సౌత్ మోపూరు, 20వ తేదీ ఆమంచర్ల, 22వ తేదీ దేవరపాలెం, 23వ తేదీ దొంతలి, 24వ తేదీ గొల్ల కందుకూరు, 25వ తేదీ కందమూరు, 26వ తేదీ కొండ్లపూడి,27వ తేదీ 29వ తేదీ పాత వెల్లంటి గ్రామాలలో నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు . అలాగే శుక్రవారం నాడు 19వ తేది సౌత్ మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నెల్లూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాపూరు చంద్రశేఖర్, గ్రామ నాయకులు, వైద్యాధికారి డాక్టర్ యూసఫ్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బట్టేపాటి అశోక్, ఎంపిహెచ్ఈఓబి పెంచలయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు ఎస్కే రసూల్ బి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.ం

# శ్రీశైలం జలాశయంకు పొంచి ఉన్న ప్రమాదం

### వాస్తవాలను సీఎం గ్రహించాలి : బీజేపీ నేత మిడుదల రమేష్

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** శ్రీశైలం జలాశయంకు 500 టిఎంసిల నీటి ప్రవాహ నష్ట ప్రమాదం పొంచి ఉంది. కర్ణాటక- తెలంగాణలు కృష్ణా జలాల వినియోగ సామర్థ్యాన్ని భారీగా పెంచుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాస్తవలను గ్రహించాలని బిజెపి నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు. కర్ణాటక లోని ఆల్మట్టి డ్యాం ఎత్తును 519 అడుగుల నుండి 524.256 అడుగులకు పెంచాలని కర్ణాటక క్యాబినెట్ మూడు రోజుల క్రితం నిర్ణయించింది. ఎత్తుపెంపు ద్వారా 130 టీఎంసీలు అదనంగా నిల్వ చేసి 1.33,867 ఎకరాల భూ సేకరణ చేయాలని 70వేల కోట్ల రూ. ఖర్చు చేయాలని కర్ణాటక సర్కార్ నిర్ణయించింది. కర్ణాటక నీటి నిర్వహణ ద్వారా చెరువులకు నీటి మళ్లింపు మూలంగా మూడు వందల టిఎంసిలు కృష్ణా జలాలు శ్రీశైలం జలాశయానికి రావు. ఈనెల 23నుండి కృష్ణా జలాల ట్రిబ్యునల్లో జరిగే తుది వాదనలలో తెలంగాణ ప్రభుత్వం 16 పథకాల ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధం చేసింది. కృష్ణా జలాలను జూరాల వరద కాలువల సామర్థ్యం పెంచి 100 టీఎంసీలు తరలించుకునేందుకు సిద్ధమైంది. నెట్టెంపాడు ఫేస్ 2 ప్రాజెక్ట్ క్రింద జూరాల నుండి నాలుగు టిఎంసిలు అదనంగా తరలించడం. కల్వకుర్తి ప్రాజెక్టుకు 13 టీఎంసీలు తరలించడం. లాంటి 16 పథకాలతో 200 టీఎంసీలు నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకునే డిపిఆర్లు సిద్ధం చేసింది. రానున్న మూడు సంవత్సరాలలో కర్ణాటక తెలంగాణ తమ పథకాలను పూర్తి చేసుకునే ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాయి. ఇవే జరిగితే 500 టీఎంసీల నీటిని శ్రీశైలం జలాశయం కోల్పోతుంది. కృష్ణాజలల వినియోగంలో ముంచుకొస్తున్న ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే దృష్టి పెట్టకపోతే ఆంధ్ర రాయలసీమ లలో బీడు భూములు మాత్రమే మిగులుతాయని రమేష్ తెలిపారు.



# భైరవరం గ్రామంలో వైద్య శిబిరం



**దుత్తలూరు/వింజమూరు, మేజర్‌న్యూస్ :** దుత్తలూరు మండలంలోని భైరవరం గ్రామ సచివాలయంలో స్వస్థ నారీ-శక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు రక్తపరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షులు పాల్గొని, ప్రజల ఆరోగ్యంపై ఇలాంటి కార్యక్రమాలు చాలా ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజలకు మరింత ఆరోగ్య సదుపాయాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణీ స్త్రీలకు, పసిపిల్లలకు అందించే పోషకాహార స్టాళ్లు ఏర్పాటు చేయగా, వాటిని మండల బీజేపీ నాయకులు పరిశీలించారు.గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి శిబిరాలు మరింత జరుగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు లెక్కల వెంగళరెడ్డి, సేవ పక్వాడ కన్వీనర్లు మండల ప్రధాన కార్యదర్శి అందె.రామయ్య, ఉపాధ్యక్షుడు పెసల కృష్ణ, బిజెపి సీనియర్ నాయకులు మేకపాటి మాల్యాద్రి నాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు చీదర్ల శివ పార్వతి,జిల్లా కార్యవర్గ సభ్యుడు చుండి హరి గోపాల్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు మూలే బాలకృష్ణారెడ్డి, కదిరి వెంకట రంగారావు, కొండాపురం మాజీ అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున, వరికుంటపాడు అధ్యక్షుడు ఏనుగు ప్రభాకర్ రెడ్డి, కన్స్యూమర్ రైట్స్ రాష్ట్ర సభ్యులు సింగవరపు సురేందర్ రెడ్డి, బిజెపి నాయకులు కార్యకర్తలు మరియు డాక్టర్ ఆయుబ్ మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు ఘనంగా సన్మానం

● జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు చిడదల శ్రీనివాస్ మాదిగ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాని శుక్రవారం జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు చిడదల శ్రీనివాస్ మాదిగ కలిసి ఘనంగా సన్మానం చేశారు. తిరుమల ప్రసాదం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పేదల సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని కోరారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగేలా చూడాలని కోరారు. జిల్లాలో ఇప్పటికే అనేక సమస్యలు ఉన్నాయని వాటిని తక్షణమే పరిష్కార మార్గం చూపాలని కోరారు. తమ నిజాయితీ తో పేదలు బాగుపడేలా చూడాలన్నారు. ఆంధ్రప్రదేశ్ లో నెల్లూరు జిల్లా అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉండేలా జిల్లాను ముందుకు తీసుకుపోతారని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యువసేన నాయకులు ఎద్దుల తిరుపాల్ మాదిగ పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాలకు నిధులు మంజూరు



కావలి, మేజన్‌న్యూస్ : కావలి పట్టణంలోని ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం నెల్లూరు జిల్లా జడ్పీ చైర్మన్ ఆనం రమణమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం వారు పాఠశాల పరిసర ప్రాంతాలను విద్యార్థులు ఉపయోగిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు ఉపాధ్యాయులతో చర్చించారు. బాలబాలికలకు వేరు వేరుగా సౌకర్యం మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని వారు తెలిపారు. ప్రతి తరగతి గది తిరిగి విద్యార్థులను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పి 15వ ఆర్థిక నిధుల నుంచి మూడు లక్షల3.30వేల రూపాయలు నిధులను మంజూరు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ నిధులతో విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లను మరమ్మత్తులు చేపిచ్చి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని తెలిపారు. అనంతరం అక్కడ పాఠశాలను పరివేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆకస్మిక తనిఖీలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కావలి జడ్పిటిసి సభ్యులు జంపని రాఘవులు ఎంపీడీవో శ్రీదేవి ఎంఈఓ లు బండి గోవిందయ్య సిహెచ్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు ఆర్థికసాయం




**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఆగ్నేష్ మల్టీపర్పస్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ ఆఫ్ ఆగ్నేస్ చారిటబుల్ ఫౌండేషన్ సహాయ సహకారాలతో నలుగురు నిరుపేద మహిళలకు చిరు వ్యాపారములు చేసుకొనుటకు కొంత ఆర్థిక సహాయం చేయడం జరిగిందని ఆ సంస్థ అధ్యక్షులు కానగల వెంకట రమణయ్య తెలిపారు. మా సంస్థ ద్వారా చిరు వ్యాపారం చేసుకునే వారికి కొంత ఆర్థిక సహాయం చేసి వారు జీవనోపాధిని కొనసాగించుటకు తోడ్పడుతుందని వారు తెలిపారు. ఇప్పటికే అనంతసాగరం మండల పరిధిలోని ఐదు గ్రామాలలో పి4 ప్రక్రియలో భాగంగా 100మందికి నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. అంతేకాకుండా తల్లిదండ్రి లేని నిరుపేద విద్యార్థులకు నోట్ బుక్స్ బ్యాగులు సహాయం చేయటం జరిగింది. కొందరిని కాలేజీలో చేర్పించి చదివించటం కూడా చేస్తున్నామని వారు తెలిపారు ఇంకా భవిష్యత్తులో ఆ సంస్థ ద్వారా ఎన్నో కార్యక్రమాలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఆగ్నేష్ మల్టీపర్పస్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ కానగల వెంకట రమణయ్య తెలియజేశారు.

## జడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండల కేంద్రం జడ్పీ హైస్కూల్ నందు ఈనెల 20, 22 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు జరుగుతాయని మండల విద్యాశాఖ అధికారి మధుసూదన్ శుక్రవారం తెలిపారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగ, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

# టీడీపీ, వైసీపీ పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన నారపరెడ్డి

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గతంలో మెడికల్ కళాశాలలో సీట్లు అమ్ముకుంటే నేడు తెలుగుదేశం పార్టీ కళాశాలనే అమ్ముకుంటుందని ఏపీసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు నెల్లూరు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక ఇందిరాభవన్లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సంగం మండలం పెరమాన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడు మంది ప్రాణాలు కోల్పోయారని ఈ ప్రమాదాలు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే జరిగాయని రవాణా శాఖ, మైనింగ్ శాఖ లోపాల వలన ఏడు మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన విమర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఐదు లక్షల పరిహారం సరిపోదని, కనీసం 30లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలుపుతూ మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరపున సంతాపం తెలియజేశారు. అదేవిధంగా మెడికల్ కాలేజీలపై వైసీపీ చేసే పోరాటం హాస్యాస్పదమని 2023లో వైసిపి ప్రభుత్వం జారీ చేసిన జీవో 108 ద్వారా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు అమ్మకానికి పెట్టారని కిరణ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. ప్రభుత్వ కాలేజీలలో మేనేజ్మెంట్ కోట, ఎన్ఆర్ఐ కోట ప్రవేశ పెట్టింది జగన్ ప్రభుత్వం అని మండిపడ్డారు. ప్రభుత్వ సొమ్ముతో కాలేజీలు కట్టి సీట్లు ఎలా అమ్ముతారని ఆయన ప్రశ్నించారు. దేశంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎక్కడ ఎన్నారై కోటలు లేవని తెలియజేశారు. తెలంగాణలో 25 మెడికల్ కాలేజీలలో వందల శాతం ఉచిత సీట్లు ఉంటే, ఆంధ్రప్రదేశ్లో మాత్రం కొత్తగా ప్రారంభమైన ఐదు కాలేజీలలోనే సీట్లు అమ్ముతున్నారని దుయ్యబట్టారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని అదేవిధంగా జీవో 108ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో జగన్ అయితే సీట్లు అమ్మే ప్రయత్నం చేశారని కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏకంగా కాలేజీలను అమ్మే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అవినీతి పునాదివేసింది వైసీపీ అని దానిని చంద్రబాబు కొనసాగిస్తారని ఆరోపించారు. ప్రజా ఆరోగ్యం



మీద చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి బిజెపి ఎమ్మెల్యే మెడికల్ కాలేజీలకు అవసరం అయ్యే నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకు రావాలని అంతేగాని కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం సరికాదని ఇదేగాని జరిగితే టిడిపి నిర్ణయానికి వ్యతిరేకంగా ఎన్ ఎస్‌యుఐతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. అంతేకాకుండా దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, ఓటు చోరీ అంశానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ స్పష్టంగా పేర్కొన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓట్లను చోరీ చేశారని ఈసీఐ వెబ్సైట్ను హ్యాక్ చేసి మరి ఓ ప్రత్యేక సాఫ్ట్వేర్ ద్వారా ఓట్లు తొలగించారని తొలగించబడ్డ ఓటర్లు కేసు పెడితే ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వలేదన్నారు. సీఈసీ నియామక వ్యవస్థని పూర్తిగా మార్చా బిజెపి అభ్యర్థిని నియమించుకునేలా రాజ్యాంగాన్ని మలుచుకున్నారని సుప్రీంకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. ఇదే వైఖరి అనుసరిస్తే ఓటు చోరీపై నెల్లూరు జిల్లాలో నియోజకవర్గాల వారీగా రాహుల్ గాంధీకి మద్దతుగా ఓటర్లు సంతకాల సేకరణతో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ప్రజాస్వామ్యాన్ని కాపాడే విధంగా అడుగులు వేస్తామని ఈ సందర్భంగా నారపరెడ్డికిరణ్ కుమార్‌రెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కే సంజయ్, అడ్వకేట్ సుధీర్, ఇఫ్రాన్ రూరల్ మల్లికార్జున్ రెడ్డి, ఓబీసీ చైర్మన్ నరేష్, మైనార్టీ నాయకుడు అల్లావుద్దీన్, మైనార్టీ చైర్మన్ రెహమాన్, సేవాదళ్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి వి.సుజాత తెలిపారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా కిసాన్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ ప్రాంతంలో మలేరియా కేసు నమోదైన రాజీవ్ నగర్ కాలనీ ప్రాంతంలో ఇండోర్ రెసిడ్యూయల్ స్ప్రే, యాంటీ లార్వల్ ఆపరేషన్స్, ఇండోర్ స్పేస్ స్ప్రే, ఫీవర్ సర్వే, పిడిపి వర్క్ మొదలు మలేరియా నివారణ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కీటక జనిత వ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఫ్రై డే డ్రై డే అవశ్యకత, వెక్టార్ కంట్రోల్ హైజీన్ ఆప్లో కొత్త ఇష్యూ ప్రతివారంలో సోమ, మంగళ వారాలలో రైజ్ చేయాలని తెలియజేశారు. అనంతరం జిల్లా మలేరియా అధికారిణి మాట్లాడుతూ వర్షములు పడినపుడు నీటి నిల్వలు ఎక్కువగా వృద్ధి పొందుట తద్వారా దోమల వృద్ధి చెందుతూ జ్వరాలు పెరిగే అవకాశం ఉన్నందున నీటి నిల్వలను తొలగించి లార్వా సర్వే ఖచ్చితంగా నాణ్యతతో చేయాలని తెలియజేశారు. మలేరియా డెంగ్యూ, చికెన్ గున్యా, బోధకాలు వ్యాధుల లక్షణాలు గురించి నివారణ మార్గాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఏఎన్ఎం ఆశాలు క్షేత్రస్థాయి పర్యటనలు చేయునప్పుడు జ్వరం కేసులను ముందస్తుగా గుర్తించిపై అధికారులకు తెలియజేసి అక్కడ ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, తగు నివారణ చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ నగర్ వైద్యాధికారి జి సునీల్ బాబు, సహాయ మలేరియా అధికారి వి.నాగార్జున రావు ఎస్‌యుఓ యుఎల్‌బి ఈ సాంసన్ బాబు, మలేరియా కార్యాలయ సూపర్వైజర్, యు.శ్రీధర్, ఆరోగ్య సహాయకులు నందకుమార్ ఆరోగ్య సహాయకులు సంజీవులు, గురవయ్య, ఎఎన్ఎం భారతి ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం వ్యాస చంద్రశేఖర్ వాల్మీకి వారు కమ్యూనికేషన్ స్కిల్, లైఫ్ స్టైల్ మేనేజ్మెంట్ పట్ల విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం వారు విద్యార్థిని, విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ.. నైపుణ్యాభివృద్ధి అంటే ఒక పనిని నిర్వహించేటప్పుడు సమర్థవంతంగా, ప్రభావవంతంగా, ఉండేలా నిర్దిష్ట నైపుణ్యాలను మెరుగుపరిచే విధంగా ప్రక్రియని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే రామన్న భవిష్యత్తులో మంచి కెరీర్ దిశగా అడుగు వేయగలరని తెలిపారు. ఉద్యోగం అనేది కేవలం జీవన ఉపాధి కోసం మాత్రమే కాదు కానీ, కుటుంబాన్ని నిలబెట్టడానికి సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా సమాజంలో ఒక బలమైన వ్యక్తిగా ఎదగడానికి వేదిక అని తెలిపారు. క్యాంపస్ డ్రైవ్ ప్రతి ఒక్కరికి ఆశాజ్యోతి వెలిగిస్తుందని విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. కొంతమంది చిన్నచిన్న



కారణాలతోనే జీవితంలో వెళ్లాల్సిన జమ్యానికి వెళ్లకుండా చెడు మార్గంలో వెళ్లి వారు అవివేకులై తమ విద్యావాస్తును జీవితాన్ని దురదృష్టకరంగా చేసుకుంటారు. అదే సరైన ఆలోచనతో ఆలోచించి చిన్న చిన్న విషయాలను సరిచేసుకొని జీవితంలో ముందుకి సాగాలని తెలిపారు. జీవితంలో కొంతమంది విద్యార్థులు చిన్న చిన్న కారణాల వలన ఓడిపోతుంటారు. ఆ ఓటమిని పట్టుదలతో తీసుకొని ఉంటే జీవితంలో విజయాన్ని సాధిస్తారని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులకు మోటివేషన్ స్పీకర్గా చంద్రశేఖర్ వాల్మీకి చెప్పిన ఒక కథను తెలుసుకున్నారు. ఇలాంటి సమయంలో ధైర్యంగా జీవితంలో ముందుకు పట్టుదలతో వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివి రావు, కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు, కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జి.రమేష్ బాబు, డిప్లమా ప్రిన్సిపాల్ ఆర్.రమణయ్య, అధ్య పకేత, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏఎస్ పేటలో అన్నదాన కార్యక్రమం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలో జరుగుతున్న శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ వారి 252వ ఉరుసు గంధ మహోత్సవాల్లో సందర్భంగా ఏఎస్ పేట గ్రామానికి చెందిన రాజా శ్రీనివాసులు రాజా సుధీర్ రాజా బాలాజీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్గాకు వచ్చే యాత్రికులు భక్తుల కోసం మెయిన్ బజార్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా భక్తులకు యాత్రికులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు ప్రతి ఏడాది గంధ మహోత్సవాలకు వచ్చే భక్తులు యాత్రికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే మెయిన్ బజార్లో రాజా సుబ్బారావు రాజా చైతన్యలు యాత్రికులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను శుక్రవాం టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్లో పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్నలు టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అలాగే కాకర్ల చారిటబుల్టిస్టు ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినేందుకు 400 ప్లేట్లు పంపిణీ చేశారు. స్టేట్‌పేట చిల్డ్రన్హోమ్ చిన్నారులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందరర్భంగా ఎమ్మెల్యే నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి నియోజకవర్గ ప్రజలకు మరింత సేవలందించి వారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహిం చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, గడ్డం వెంకటేశ్వర్లు, నల్లిపోగు నరసింహా, బొజ్జా శ్రీనివాసులు, ఓబులరెడ్డి, సందాని, శివకృష్ణ, రియాజ్, జి.ఓబులరెడ్డి జల్సాయాదవ్, హరీష్ యాదవ్, రామ్ మోహన్ మండల నాయకులు పాల్గొన్నారు.

## ఆహారం తీసుకునేలా తగిన చర్యలు తీసుకోండి



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** స్త్రీ, శిశు సంక్షేమ ఆధ్వర్యంలో నిర్వహించే 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా శుక్రవారం చేజర్ల మండలం తూర్పుపల్లి సచివాలయం పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు పిల్లల యొక్క తల్లిదండ్రులను, పురుషులందరినీ భాగస్వాములుగా చేసి పోషకాహారం గురించి తెలియజేసి వారి కుటుంబంలో ఉన్నటువంటి తల్లులు, పిల్లలు పోషకాహారం, సమతుల్ ఆహారం తీసుకునేలా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా అందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్మి సిద్దుల నాయుడు, పీహెచ్‌సి డాక్టర్, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు అంగన్వాడి కార్యకర్తలు ఎల్ఎంహెచ్‌పిలు సూపర్వైజర్ ఎం.పద్మ పాల్గొన్నారు.

# ఉద్దేశపూర్వకంగా రాద్ధాంతం చేస్తే సహించను : సుబ్బారెడ్డి

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** కావలి కావలి ఉదయగిరి నేషనల్ హైవే హెచ్.పీ పెట్రోల్ బంక్ ఎదురుగా 50సెంట్లు భూమిని కొనుగోలు చేశానని సదరు భూమిని నేను వ్యాపార నిమిత్తం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు నా భూమి దిగువ భాగం ఉన్న వ్యక్తులు కావాలని ఉద్దేశపూర్వకంగా రాద్ధాంతం చేస్తున్నారని ఎలాంటి రికార్డు లేకుండా రాద్ధాంతం చేస్తే తాను సహించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనకాడ బోనని ప్రముఖ రియల్టర్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విఆర్ ఫంక్షన్ ప్లాజాలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుందూరు వెంకటరత్నం, కుందూరు భాగ్యలక్ష్మి చెందిన 50 సెంట్లు భూమిని తాను కొనుగోలు చేశానని సదరు స్థలంలో ఇప్పటివరకు తాను ఎలాంటి కార్యకలాపాలు చేయకపోవడంతో దిగువ భాగాన ఉండేవారు నేను కొనుగోలు చేసిన స్థలం గుండా రాకపోకలు సాగిస్తున్నారని ఈ నేపథ్యంలో ఇటీవల అభివృద్ధి కొరకు పనులు చేపడుతున్న నేపథ్యంలో దిగువ బాగాన ఉన్న కొందరు నేను ఫినిషింగ్ వేసుకున్నటువంటి రాళ్ళను పగలుగొట్టి తమకు రహదారి సౌకర్యం కల్పిస్తేనే ఇక్కడ ఎలాంటి పనులైనా చేసుకోవచ్చు లేకుంటే తాము ప్రతి పనిని అడ్డుకుంటామనే రీతిలో వ్యవహరిస్తున్నారన్నారు. ఈ భూమి గతంలో 1967లో ఒక అవిభాజ్య భిన్నం 4.53 సెంట్లు భూమిని వెంకటాద్రి నాయుడు, ఆది లక్ష్మమ్మ ద్వారా 1967 అక్టోబర్ 6 తేదీన ఐదు భిన్నాలుగా రిజిస్టర్ చేశారని తెలిపారు. అందులో కందిమల్ల రామయ్య ద్వారా వారు కొనుగోలు చేశారని నేను బొబ్బర కోటేశ్వరమ్మ ద్వారా సంక్రమించిన భూమిని కొనుగోలు చేశానని తెలిపారు. ఈ ఐదు భిన్నాలకు ఎక్కడ కూడా ఒక భిన్నానికి మరొక భిన్నానికి ఉమ్మడి రహదారులు ఉన్నట్లు రిజిస్టర్‌లో లేదని ఆయన తెలియజేశారు. కందిమల రామయ్య విస్తీర్ణంలో ఎంజాయ్మెంట్ కూడా తీశామని దానిలో కూడా ఉన్న నలుగురి ఎంజాయ్మెంట్ విస్తీర్ణం కూడా సరిపోతుందని తెలిపారు.వారు రహదారి చూపించుకోకుండా మొత్తం భూమిని అగ్రికల్చర్ రూపంలో కొనుగోలు చేసి ఈరోజు మా భూమిలో దారి హక్కు కావాలని వారు దుశ్ఛర్యలకు పాల్పడుతున్నారు. తాను వ్యాపార



రంగం తోపాటు రాజకీయ రంగంలో కూడా ఉద్దేశంతో ఎంతో సహనంతో ఓర్పుతో ఉంటున్నప్పటికీ వారిని కొంతమంది లేని దారికి కల్పించాలని రాద్ధాంతం చేసే విధంగా చూస్తే తనకేం కాదని వారిని ప్రోత్సహించిన వారివల్ల కింద నివాసముంటున్న వారికే ఇబ్బంది కలుగుతుంది తప్ప తనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. రాజకీయంగా తనని ఎదుర్కోవాలంటే ఎదుర్కోవచ్చు గాని ఇలాంటి పనులు చేసే కొంతమంది నేతలు ఇకనైనా ఇలాంటి చిల్లర పనులకుపురికొల్పడం మానుకోవాలని హితవు పలికారు.

# 100 కోట్లు పన్నులు వసూళ్లు సాధించేలా కృషి చేయండి



## రీజనల్ డైరెక్టర్ హరికృష్ణ

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** రీజనల్ డైరెక్టర్ (ఆర్‌డిఎంఏ) హరికృష్ణ నెల్లూరు నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగంతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.డి మాట్లాడుతూ.. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్నులపై ప్రత్యేక దృష్టి సారించి 100 శాతం లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కమర్షియల్ ఆస్తిపన్ను బకాయిల వసూళ్లకై నోటీసులను జారీ చేసే చట్ట ప్రకారమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం కార్పొరేషన్ పరిధిలో 100 కోట్ల పన్నులు వసూళ్లు సాధించేలా రెవెన్యూ విభాగం కృషి చేయాలని ఆర్.డి సూచించారు. రాష్ట్రంలోని 15 కార్పొరేషన్‌లతో పోటీ పడుతూ రెవెన్యూ వసూళ్లలో మొదటి నాలుగు స్థానాల్లో నెల్లూరు నగరపాలక సంస్థ ఉండేలా కృషి చేయాలని సూచించారు. ఖాళీ స్థలం పన్నులు గత ఏడాది వసూలు చేసిన స్థల యాజమానుల నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా 100 శాతం వసూలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలా నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించని అడ్మిన్ కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భవనాల్లో నూతనంగా నిర్మించిన అదనపు అంతస్తులు, రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్‌గా మారిన భవనాలను గుర్తించి పన్నులను పెంచి వసూళ్లు సాధించాలని ఆర్.డి సూచించారు. తాగునీటి కుళాయి పన్నులపై ప్రత్యేక దృష్టి సారించి వసూళ్లను సాధించాలని, మొండి బకాయి దారుల కనెక్షన్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ విభాగం అధికారులు సమద్, శ్రీనివాసులు, సూపర్ ఇంటెండెంట్ చినబాబు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** జనహృదయనేత, యంగ్ డైనమిక్ లీడర్ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ లో మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు ఆధ్వర్యంలో మండల నాయకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ముందుగా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు మాట్లాడుతూ ఉదయగిరి ప్రజల హృదయాలను గెలిచిన మహా నేత ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. ప్రజాసేవకుడిగా ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల హృదయాలను గెలిచిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయన ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో తలతూగాలని మరెన్నో మనసారా శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామిని మండల నాయకులందరూ ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రావెల నాగేంద్ర, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, తెలుగు యువత అధ్యక్షులు ముజ్జే లక్ష్మీనారాయణ, గ్రామ అధ్యక్షులు పొద మాధవరావు, సొసైటీ అధ్యక్షులు గుర్రం గోపి, డైరెక్టర్ మానకొండలరావు, వైస్ ఎంపీపీ టు దేవనబోయిన మధు, జనసేన పార్టీ అధ్యక్షులు రసూల్, మాజీ మండల కన్వీనర్ వెంకయ్య, పాములపల్లి మాజీ సర్పంచ్ వెంకటయ్య, మండల క్లస్టర్ ఇన్చార్జి పోక మహేష్, యూనిట్ ఇన్చార్జి నాదెళ్ల రాజా, గ్రామ నాయకులు గంగవరపు పుల్లయ్య నాయుడు, పేరం సుధాకర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు గంగవరపు శివరామ నాయుడు, అంద్ర బాల గురువారెడ్డి, సంధిరెడ్డి మాలకొండ రాయుడు, వెంగళరావు, లాభాను, ఆంద్రాశివరామిరెడ్డి, ఆంద్ర నాగిరెడ్డి, చంచల దిలీప్, చంచల బుజ్జయ్య, శాంతమ్మ, అరుణమ్మ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## డీసీపల్లిలో అమావాస్య సామూహిక కార్యక్రమాలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మహాలయ అమావాస్య సందర్భంగా ఉచిత సామూహిక పిండ ప్రధానం, పితృతర్పణాలు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పురోహిత బ్రహ్మ డాక్టర్ చింతలపల్లి మధుసూదన్ శాస్త్రి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లాలోని మర్రిపాడు మండలం డీసీపల్లి గ్రామ శివాలయం నందు సెప్టెంబర్ నెల 21వ తేదీ ఆదివారం మహాలయ అమావాస్య సందర్భంగా నిర్వహించబడునని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 9 గంటలకు మహా శివునికి రుద్రాభిషేకం తదుపరి రుద్రహోమం మధ్యాహ్నం 12 గంటలకు సామూహిక పిండ ప్రధాన పితృతర్పణాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ సామూహిక కార్యక్రమాల్లో పాల్గొనదలచిన వారు ఈ నెంబర్లను 9490131719, 9490637595 సంప్రదించవచ్చునని మధుసూదన్ శాస్త్రి పేర్కొన్నారు.

## అక్రమించిన ప్రహరీ గోడను తొలగించండి



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 16 డివిజన్ ముత్తుకూరు గేటు ప్రాంతంలో శుక్రవారం పర్యటించారు. ప్రధాన డ్రైన్ కాలువను ఆక్రమిస్తూ నిర్మిస్తున్న ప్రహరీ గోడను కమిషనర్ గుర్తించి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ప్రధాన డ్రైను కాలువ ద్వారా మురుగునీటి ప్రవాహానికి, వర్షపు నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని శానిటేషన్ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. ముత్తుకూరు బస్టాండ్ కూడలిలో రోడ్లను ఆక్రమిస్తూ ఏర్పాటుచేసిన తోపుడు బండ్లు, దుకాణాలను తొలగించి ప్రత్యామ్నాయ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ హిమబిందు, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సుధాకర్ చౌదరిని సన్మానించిన ఎమ్మెల్యేలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** క్రిబ్కోనూతన చైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త వల్లభనేని సుధాకర్ చౌదరి ఎన్నికైన సందర్భంగా, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి విజయవాడలోని ఆయన నివాసంలో, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావుతో కలిసి సుధాకర్ చౌదరిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇద్దరు ప్రజాప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. 'వల్లభనేని సుధాకర్ చౌదరి వ్యాపార రంగంలోనే కాకుండా సమాజహితం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తూ, ప్రజలకు ఆదర్శప్రాయమైన జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారు. ఆయన క్రిబ్కో చైర్మన్‌గా ఎన్నిక కావడం తెలుగు ప్రజలకు గర్వకారణం. ఆయన నాయకత్వంలో క్రిబ్కో మరింత అభివృద్ధి సాధించి రైతాంగానికి, వ్యవసాయ రంగానికి మరింత మేలు చేస్తుంది' అని అభిప్రాయపడ్డారు.

# ఇసుకమాఫియాలను అరికట్టాలి : సీపీఐ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో ఇసుక మాఫియాను అరికట్టాలని స్థానిక సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు పట్టణ సిపిఐ కార్యదర్శి జంగం నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావనికి ఒక వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షించాలని వారు కోరారు. రెండు రోజుల క్రితం ఇసుకట్రిప్పర్ ఢీకొని కారులో ప్రయాణిస్తున్న 7మంది మృత్యువాతబడ్డారని, ఆ కుటుంబాలకు ప్రభుత్వం 25లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా పట్టణ సిపిఐ కార్యదర్శి జంగం నాగరాజు మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో సంగం ఇసుక రీచ్ నుండి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలతో సరైన పత్రాలు లేకుండా, అర్హులైన డ్రైవర్లు లేకుండా ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తున్నారని, ఆవాహనాలు రోడ్లపై అమితవేగంగా నడుపుతున్నారని, అందువలనే పెరమన వద్ద ఘోరరోడ్డు ప్రమాదం జరిగి 7మంది ప్రాణాలు గాలిలో కలిశాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కుబడిగా మృతుల కుటుంబాలకు ఐదు లక్షలరూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి చేతులు దులుపుకుందన్నారు. మృతుల కుటుంబాలకు 25లక్షల రూపాయల వంతున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ట్రిప్పర్ డ్రైవర్, యజమానిమీద క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇసుకమాఫియాను అరికట్టి ప్రమాదాలు జరుగకుండా చూడాలని కూడా ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు బెల్లంకొండ హజరత్తయ్య, నాగేంద్ర, మాలకొండయ్య, ఎం.రమణయ్య, ఎన్.కొండయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సరైనపోషకాహారం-ఆరోగ్యకరమైన జీవితం : సీడీపీఓ





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సరైనపోషకాహారం-ఆరోగ్యకరమైన జీవితం లక్ష్యంగా ప్రభుత్వం పోషణ్‌మా కార్యక్రమాన్ని నెలరోజులపాటు అన్ని సచివాలయాల్లో, పంచాయతీల్లో నిర్వహించేలా నిర్ణయించిందని ఆత్మకూరు ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పేర్కొన్నారు. పోషణ్‌మా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మహిమలూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న సిడిపివో సునీలత ప్రసంగిస్తూ పోషకాహారలోపాన్ని ఎదుర్కోవడానికి, సమగ్రశ్రేయస్సును ప్రోత్సహించ డానికి ఈ అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని, మహిళలందరూ తగిన అవగాహన పెంపొందించుకోవాలని, పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహార అవసరాలను గురించి ఆమె వివరించారు. తగిన పోషకాహారం అందించడం ద్వారా పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పిల్లల ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ఆమె వివరించారు. పోషణమాసం అవగాహనా కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల్లో, పంచాయతీల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాల్సి ఉందన్నారు. స్వస్త్‌నారీ, స్వశక్తిపరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేయగా పరిశీలించిన సిడిపివో పాల్గొన్న మహిళలకు చూపించి వివరించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు తగిన పోషకవిలువల ఆహారాన్ని, కోడిగ్రుడ్డు, బాలామృతం, పాలు తదితరాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నామని, వాటిని అందరూ సక్రమంగా వినియోగించుకోవాలని, దాంతో పాటు తమకు అందుబాటులో ఉన్న పోషకవిలువల ఆకుకూరలు, కూరగాయలు, అపరాలు తదితరాలను కూడా తీసుకోవాలని సునీలత కోరారు. తల్లీ, బిడ్డ ఆరోగ్యవంతంగా ఉండేందుకు తప్పకుండా పోషకవిలువల ఆహారాన్ని తీసుకోవాలని, రక్తహీనతకు గురికాకుండా ఉండగలరని సునీలత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు డి.శ్రీదేవి, జి.కస్తూరిలు పౌష్టికాహారం గురించి వివరించారు.

అనంతరం సిడిపివో సునీలత పలువురు మహిళలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.అంగన్‌వాడీ కార్యకర్తలు నాగేశ్వరమ్మ, కోటమ్మ, కేశవరత్నమ్మ, పీరాబీ, రాములమ్మ, వైద్య,ఆరోగ్య సిబ్బంది, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు, చిన్నారులు, కిశోరబాలికలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తరలింపుపై పట్టించుకోని అధికారులు

## ప్రమాదమృతులను ఆదుకోవాలని ఆర్డీఓకి వినతి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ప్రాంతంలో ఇసుకను అక్రమంగా యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, పెరమన వద్ద ఇసుకట్రిప్పర్ ఢీకొనడంతో మృతిచెందిన 7మంది కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆత్మకూరు పట్టణ సిపిఎం కార్యదర్శి కె.డేవిడ్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావనికి ఒక వినతిపత్రం అందజేశారు. పెరమనవద్ద అధిక ఇసుకలోడుతో అమిత వేగంగా రాంగ్‌రూట్‌లో వచ్చిన భారీ టర్బోవాహనం కారును ఢీకొనడంతో 7మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని ఆయన పేర్కొన్నారు. వాహన డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపారని, హైవేలో మద్యం దుకాణాలు ఉన్నందున డ్రైవర్లు మద్యం సేవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నెల్లూరు-ముంబాయి 67వనెంబర్ జాతీయరహదారిని నాలుగులైన్లుగా విస్తరించాలని, మధ్య డివైడర్లు ఏర్పాటు చేయాలని, ఇసుకను అక్రమంగా, అధిక లోడుతో తోలుతున్న వాహనాలను సీజ్‌చేయాలని, వాహనాల యజమానులపై కఠిన శిక్షలు తీసుకోవాలని డేవిడ్‌రాజు డిమాండ్ చేశారు. సంగం మండలం పెరమనరోడ్డు వద్ద రెండురోజుల క్రితం జరిగిన ప్రమాదంలో మృతిచెందినవారి కుటుంబాల వారికి 25లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఈప్రమాదానికి కారణం గురించి అధికారులు సమగ్రంగా విచారించి కంటితుడుపు చర్యలు కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, హైవే సమీపంలోని మద్యం దుకాణాలను తొలగించాలని, పట్టణంలో మద్యం షాపులు సమయపాలన పాటించేలా చూడాలని డేవిడ్‌రాజు కోరారు. కార్యక్రమంలో సిపిఎం కె.లక్ష్మమ్మ, పి.కృష్ణమోహన్, ఎస్.పద్మ, సంధాని, సుమతి, మస్తాన్, అహ్మద్, రసూల్, రమణయ్యలు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో 14 ప్రభుత్వ జూనియర్‌కాలేజీలు

### అధికంగా మంత్రి ఆనం కృషే

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రభుత్వపరంగా 14 జూనియర్ కాలేజీలుండగా అందులో దాదాపు 80శాతం నాడు, నేడు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషితోనే లభించాయి. ఆత్మకూరులో ప్రభుత్వ జూనియర్‌కాలేజీ, హైస్కూల్‌ప్లస్, ఏఎస్‌పేటలో మాడల్ జూనియర్ కాలేజీ, అక్కడే కస్తూర్బాగాంధీబాలికల జూనియర్ కాలేజీ, మర్రిపాడులో కెజిబివి జూనియర్ కాలేజీ, అక్కడే ప్రభుత్వ జూనియర్ కాలేజీ, మర్రిపాడు మండలం నందవరంలో మాడల్‌జూనియర్ కాలేజీ, సంగంలో ఏపిఎస్‌డబ్ల్యుఆర్ జూనియర్ కాలేజీ అక్కడే హైస్కూల్‌ప్లస్, సంగం మండలం గాంధీజనసంఘంలో హైస్కూల్‌ప్లస్, అనంతసాగరంలో కోఆపరేటివ్ జూనియర్‌కాలేజీ, అక్కడే హైస్కూల్‌ప్లస్, చేజర్లలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, చేజర్ల మండలం ఆదూరుపల్లిలో హైస్కూల్‌ప్లస్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో అత్యధికశాతం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సాధించినవే. ఆయన విద్యాసంస్థల పరంగా ఆత్మకూరులో ప్రభుత్వ పాలిటెక్నిక్, బాలికల గురుకుల జూనియర్‌కాలేజీ, సంగం, చేజర్ల, సోమశిలల్లో ఐటిఐ కాలేజీలు కూడా మంజూరు చేయించారు. సింహపురి విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కాలేజీ మంజూరుకూడా త్వరలో కానుంది. జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది ప్రత్యేక విద్యను ఆత్మకూరు నియోజకవర్గంలో పొందే అవకాశాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కల్పించారు. అందరూ హర్షం వ్యక్తం చేస్తూ మంత్రిని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## అంతర్‌కళాశాలల క్రీడాపోటీలు నేటినుండి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** విక్రమసింహపురి విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు తమ కాలేజీలో ఈనెల 20, 21వ తేదీల్లో నిర్వహిస్తామని ఆత్మకూరులోని డాక్టర్ ఎస్ఆర్‌జె డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ జి.వరకుమారి, పిడి, పోటీల నిర్వాహకులు సిరిమామిళ్ళ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కబడ్డీ, చెస్, టగ్‌ఆఫ్‌వార్ పోటీలను నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈపోటీల్లో విక్రమసింహపురి విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కనుమూరి సునీత, యూనివర్సిటీ స్పోర్ట్స్‌బోర్డు కార్యదర్శి డాక్టర్ సి.హెచ్.వెంకట్రాయులు, జవహర్‌భారతి (కావలి) కాలేజీ పిడి పి.ప్రసాద్‌రెడ్డి పాల్గొంటారని వారు తెలిపారు. శనివారం ఉదయం 9.30గంటలకు ఈ క్రీడా పోటీలను ప్రారంభిస్తామని వరకుమారి, వెంకటేశ్వర్లు తెలిపారు.

## తప్పులు లేని ఓటరు జాబితాకు సహకరించాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గంలో తప్పులుతడకలు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎల్.రామ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తహసీల్దారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 323 పోలింగ్ కేంద్రాల పరిధిలో 18 ఏళ్ళు నిండిన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించడంతోపాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను పారదర్శకం గా చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో 3,27,297 లక్షల మంది జనాభా ఉండగా 2,41,742 లక్షల మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నీహా, రాజకీయ పార్టీల నాయకులు బయ్యన్న, వెంకటేశ్వర్లు, పలు మండలాల తహసీల్దారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్న కేసు సోమవారానికి వాయిదా

### ఈలోగా ఎలాంటి బల ప్రయోగం చేయవద్దని పోలీసులకు ఆదేశం

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** కోవూరు మాజీ శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హైకోర్టులో వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ ఈనెల 22 సోమవారానికి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నెల్లూరు జిల్లా పర్యటనలో ఒక కానిస్టేబుల్ పై ప్రసన్న దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణ పై దర్గామిట్ట పోలీసులు ఆయన పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించగా న్యాయస్థానం ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. దీంతో ఆయన హైకోర్టు ను ఆశ్రయించారు. జరిగిన ఘటనలో ప్రసన్న తప్పు లేదని వారి న్యాయవాదులు కొన్ని వీడియోలు కోర్టుకు సమర్పించగా పోలీసులు కూడా కొన్ని వీడియోలు దాఖలు చేశారు. దీంతో పూర్తి స్థాయిలో బెయిల్ పిటిషన్ పై విచారణ జరిపేందుకు న్యాయమూర్తి సోమవారం నాటికి కేసు వాయిదా వేశారు. ఈ లోగా ఆయనపై ఎలాంటి బలప్రయోగం చేయవద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

# మహిమలూరులో ఘనంగా వ్యవసాయక్షేత్రదినోత్సవం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో వ్యవసాయక్షేత్రదినోత్సవాన్ని శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. పలువురు వ్యవసాయాధికారులు పాల్గొని క్రృతివ్యవసాయం ద్వారా పంటలు సాగుచేస్తున్న రైతు ఇరగన శ్రీనివాసులుకు చెందిన ఏగ్రేడ్‌మాడల్, రైజ్డ్‌బెడ్, ఏటిఎం వెండర్లును అధ్యయనం చేయడం, అవగాహనా సదస్సు, ర్యాలీ, పొలాల్లో క్షేత్రపరిశీలన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వివిద రకాల పైర్ల పొలాల్లో అధికారులు, రైతులు పర్యటించి వ్యవసాయ అంశాలను గురించి చర్చించుకున్నారు. జిల్లాలోని పొదలకూరు, ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు, వింజమూరు, ఉదయగిరి సబ్‌డివిజన్‌లోని వ్యవసాయాధికారులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నిరకాల మాడళ్ళ లో సాగుచేస్తున్న ప్రకృతివ్యవసాయం గురించి వారు రైతులకు వివరించి తగిన అవగాహన కల్పించారు. పంటలసాగు, ఎరువుల వినియోగం, సస్య రక్షణ, ప్రకృతివ్యవసాయం వలన కలిగెడి ప్రయోజనాలు గురించి వారంతా రైతులకు వివరించారు. రైతు ఇరగన శ్రీనివాసులు తాను సాగుచేస్తున్న ప్రకృతివ్యవసాయవిధానంలో పంటల సాగు, తద్వారా లభించెడి ఉత్పత్తులు, లాభాలు గురించి వివరించారు. ఏపిసిఎన్‌ఎఫ్ అడిషనల్ డిపిఎం ముని రత్నం మాట్లాడుతూ.. రైతులు ప్రకృతివ్యవసాయం అలవాటు చేసుకోవాలని, ప్రకృతివ్యవసాయం చేస్తే ఆరోగ్యకరమై ఉత్పత్తులు లభిస్తాయని,




పెట్టుబడి గణనీయంగా తగ్గుతుందని, అధికంగా రాబడులుంటాయని పేర్కొన్నారు. ఏఎస్‌పేట మండలం పెద్దబ్బీపురం రైతు సుధాకర్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, చిన్న, సన్నకారురైతులు ఖర్చులు తగ్గించుకునే పరిస్థితి, నికరలాభాలు గురించి వివరించారు. 365రోజులు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోవూరు, ఆత్మకూరు, వింజమూరు, ఉదయగిరి, పొదలకూరు, నెల్లూరు వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయాధికారులు, అభ్యుదయరైతులు, ఏపిసిఎన్‌ఎఫ్ సిబ్బంది, మహిమలూరు విఏఏ శ్రీహరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి : వ్యవసాయ అధికారి




**సంగం, మేజర్‌న్యూస్ :** సంగం మండలంలోని బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు జడ్పీ హైస్కూల్ సంఘం సంఘం నందు విద్యార్థిని విద్యార్థులకు భూసార పరీక్షల మీద శిక్షణా కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ దేవసేన మాట్లాడుతూ.. పంటలకు అవసరమైన పోషకాల గురించి వివరించి వాటి యొక్క ఉపయోగాల గురించి తెలియజేశారు. విద్యార్థులందరూ కూడా వారి యొక్క తల్లిదండ్రులకు వ్యవసాయం చేసేటప్పుడు తప్పనిసరిగా భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా మాత్రమే ఎరువులను వాడగాలని తెలియజేయాలని కోరడమైనది అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనూష మాట్లాడుతూ మట్టిలో ఉన్నటువంటి రకాలు గురించి, వివిధ రకాల మట్టి యొక్క భౌతిక స్థితుల గురించి వివరిస్తూ వాటి యొక్క నమూనాలను చూపించడం జరిగింది. భూసార పరీక్ష కేంద్రం నెల్లూరు వ్యవసాయ అధికారిని ఇంద్రావతి మాట్లాడుతూ మట్టి పరీక్షలను చేసే విధానం గురించి వివరిస్తూ మట్టిలో ఉన్నటువంటి ఈ పోషకాల ఆధారంగా వాటి యొక్క నాణ్యత ప్రమాణాలను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుమతమ్మ, జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ బుజ్జయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సంగం సొసైటీ నందు రైతులకు భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరువులు వేసుకోవాలని రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీనివాస యాదవ్, షేక్ బాబు పిఎసిఎస్ సీఈవో దస్తగిరి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పోషణ మాసం మహోత్సవాల కార్యక్రమం

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పరిధిలో సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 16వ తేదీ వరకు 8వ రాష్ట్రీయ పోషణ మాసం మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు నెల్లూరు అర్బన్, నెల్లూరు రూరల్ ప్రాజెక్టు పరిధిలోని శుక్రవారం నాడు వెంగల్ రావు నగర్ సెక్టర్ లో అంబేద్కర్ నగర్ అంగన్వాడి సెంటర్ నందు ఐ సి డిఎస్ సూపర్వైజర్ ఏ రాజేశ్వరి ఆధ్వర్యంలో పోషణ మాసం మహోత్సవాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అలాగే గర్భవతులకు,బాలింతలకు, చిన్న పిల్లలు తీసుకోవలసిన సమతుల్య ఆహారం మరియు నూనె, సాల్టు, చక్కెర వినియోగం తగ్గించాలని, తల్లిపాలు, చిన్నపిల్లలో స్థూల కాయం, బాల్య దశ,సంరక్షణ విద్య, మొదలైన వాటిపై అవగాహన నిర్వహించడం జరిగింది. అలాగే తల్లుల చేత పలు రకాల వంటకాలు చేయించి తల్లులకు అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా పిల్లల పోషణలో పురుషుల భాగస్వామ్యం కావాలని సూచించారు. అలాగే పోషణ మరియు సంరక్షణలో పురుషుల పాత్రను ప్రోత్సహించడం. పిల్లల పోషణలో తల్లికి సపోర్ట్ ఇవ్వడం, వారి ఆరోగ్యం




దృష్టిలో భాగస్వామ్యం పెంచడం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఎస్‌డి హమర్ జాన్, ఏ శాలిని, అంగన్వాడి కార్యకర్తలు ఎన్ కృష్ణవేణి, గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో రేషన్ షాపులు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నందు నెల్లూరు రూరల్ నియోజకవర్గ రేషన్ డీలర్లకు రేషన్ బియ్యం పంపిణీ పై ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ షేక్ జమీర్ భాష మరియు నెల్లూరు రూరల్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు ఎక్కడైనా కార్డుదారులకు బియ్యం ఇతర సరుకు సక్రమముగా ఇవ్వకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయడంతో పాటు దివ్యాంగులు, వృద్ధులకు ఇళ్ల వద్దనే పంపిణీ చేయాలని సూచించారు. అలాగే ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ సరుకుల పంపిణీ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా దేవరకొండ శీను



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో తెలుగుదేశం పార్టీలో చురుగ్గా సభలు సమావేశాలలో పాల్గొంటూ రంగా కాంస్యం విగ్రహానికి నాందివేసిన వ్యక్తి తనకంటూ పార్టీలో ఒక ప్రత్యేక స్థానాన్ని గుర్తింపు తెచ్చుకున్న దేవరకొండ శ్రీనివాసులను ఆర్టీసీ ఎంప్లాయిస్ వారు యూనియన్ గౌరవాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. అన్ని విధాల శక్తి సామర్థ్యాలు కల వ్యక్తి దేవరకొండ శీను అని మాకు ఎల్లవేళలా అండగా తోడుగా ఉంటాడని నమ్మకతో తను ను గౌరవాధ్యక్షుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్టీసీ ఎంప్లాయిస్ గౌరవాధ్యక్షుడు దేవరకొండ శీను మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులకు ఎల్లవేళలా తోడుగా ఉంటానని, అలాగే ఏ సమస్య వచ్చినప్పటికీ కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి దగ్గరకు తీసుకెళ్లి ఆ సమస్యను వివరించి తగు న్యాయం చేసేందుకు సాయి శక్తుల ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

## స్వస్త్ నారి స్వస్త్ శక్తి పరివార్ ఆరోగ్య శిబిరం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వస్త్ నారి స్వస్త్ శక్తి పరివార్ కార్యక్రమం శుక్రవారం బ్రాహ్మణక్రాకలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. దేశ ప్రజల ఆరోగ్యం కోసం ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ముడి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పల్లె ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసిందన్నారు. మహిళలు శక్తివంతమైన కుటుంబం అవలంబించడంలో ప్రధాన పాత్ర వహిస్తారన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి ఆరోగ్యంవంతమైన సేవలను సులభతరం చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. చక్కెర వంట నూనెలను 10 శాతం తగ్గించి వాడటం వలన స్థానిక, ప్రాంతీయ ఆహారాన్ని ప్రోత్సహించాలి, బాల్య సంరక్షణ, శిశువు చిన్న పిల్లల ఆహార పద్ధతులను మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, బిజెపి జిల్లా కార్యదర్శి మారెళ్ళ బ్రహ్మారెడ్డి, టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు వంటేరు జయచంద్రారెడ్డి, బిజెపి నాయకులు బండారు తిరుపతిరెడ్డి, వంటేరు రాకేష్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సేవ పక్షవల్ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ముత్తుకూరు మండల కేంద్రం లో విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి మాట్లాడారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈపూరు సాయికృష్ణారెడ్డి, మునెమ్మ, విజయ్, శ్రావణ్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా భూసేకరణ : కలెక్టర్ హిమాన్షు శుక్లా

**పరిశ్రమల రాకతో పెరగనున్న ఉపాధి అవకాశాలు**

**గుడ్లూరులో పరిశ్రమల హబ్ : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**



**నెల్లూరు, కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** కందుకూరు డివిజన్ గుడ్లూరు మండలం చేవూరు గ్రామం కొత్త పారిశ్రామిక విప్లవానికి సాక్ష్యంగా మారబోతోంది. ఇక్కడ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం వేగవంతంగా భూసేకరణ చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 15,090 ఎకరాలు అవసరం కాగా, ఇప్పటి వరకు 1,875 ఎకరాల భూసేకరణ పూర్తై పరిశ్రమల కోసం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో మరింత వేగంగా భూసేకరణ కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు :** ఈ హబ్‌లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వంటి ప్రధాన పరిశ్రమలు స్థాపనకు సిద్ధమవుతున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా వేలాది ఉద్యోగాలు స్థానిక యువతకు లభించనున్నాయి. పరోక్షంగా అనేక ఉపాధి అవకాశాలు వ్యాపారాలు, రవాణా, సేవా రంగాల్లో ఏర్పడతాయి. ఇది కేవలం గుడ్లూరు మండలానికి మాత్రమే కాకుండా, మొత్తం జిల్లాకు ఒక పెద్ద ఆర్థిక బలం కలిగించనుంది.

**భూములు కోల్పోయిన వారికి భరోసా :** పరిశ్రమల కోసం తమ భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందిస్తోంది. సంతృప్తికరమైన నష్టపరిహారం, పునరావాసం, పునరుద్ధరణ చర్యలతో భూములు ఇచ్చిన కుటుంబాలకు తగిన భద్రత, భరోసా కల్పిస్తోంది.

**ప్రాంతీయ అభివృద్ధికి నాంది :** ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త నాంది పలుకనుంది. రోడ్లు, విద్యుత్, నీరు వంటి మౌళిక వసతులు మరింత మెరుగుపడతాయి. దీనితోపాటు చిన్న చిన్న వ్యాపారాలు, స్టార్టప్ కంపెనీలు కూడా వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు లభించడం ద్వారా వారు పరిశ్రమల్లో ఎక్కువగా ఉద్యోగాలు పొందుటకు అవకాశాలు కలవు. చేవూరు గ్రామంలో ప్రారంభమైన ఈ భూసేకరణ భవిష్యత్తు తరాల కోసం ఒక అభివృద్ధి పథం. పరిశ్రమల రాకతో వేలాది కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతోపాటు జీవనోపాదికి స్థిరపడతాయి. రైతులకు నష్టపరిహారం అందించడంతో పాటు, ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా ప్రభుత్వం సమగ్రాభివృదద్ధికి కృషిచేస్తోంది.

# ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి : కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని కమిషనర్ వై.ఓ నందన్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి సందేహాలు, ఫిర్యాదులు, తదితర అంశాల గురించి అవగాహన కల్పించేందుకు ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈరోజు వివిధ అంశాలపై 22 మంది పౌరులకు ఓపెన్ ఫోరం కార్యక్రమం ద్వారా సందేహాల నివృత్తి చేసి అవగాహన కల్పించామని కమిషనర్ తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార లేఔట్ లో ప్లాట్ల యజమానులకు చట్టబద్ధహక్కులు కల్పించే ఎల్.ఆర్.ఎస్ పథకం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనధికార లేఔట్ లోని ప్లాట్ల యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం క్రమబద్ధీకరణ పథకం ఎల్.ఆర్.ఎస్ 2020 ను సవరిస్తూ ప్రభుత్వం తాజాగా జీవో నెంబర్ ఎం.ఎస్.నెం 134 రు, తేదీ 26-07-25 ప్రకారం ఉత్తర్వులను జారీ చేసిందని తెలిపారు. తాజా ఉత్తర్వుల ప్రకారంగా ఈ ఏడాది జూన్ నెల 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసిన ప్లాట్లు క్రమబద్ధీకరణకు అర్హత కలిగి ఉన్నాయని తెలిపారు. పెండింగ్ లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను కొత్త నిబంధనల ద్వారా అనుమతించవచ్చని కమిషనర్ ప్రకటించారు. ఓపెన్ ఫోరం అవగాహన కార్యక్రమం ద్వారా సందేహాలను నివృత్తి చేసుకొని, ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా స్థానిక గుడిపల్లిపాడు ప్రాంతంలోని లేఔట్ కు సంబంధించి నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు, స్థల అధికారిక యాజమాన్య హక్కు పత్రాలను పొందినట్లు కార్యక్రమంలో పాల్గొన్న స్థలాల యజమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వై.ఓ నందన్, సిటీ ప్లానర్ హిమబిందు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ హిమబిందు, బిల్డర్లు, లైసెన్సుడ్ టెక్నికల్ పర్సన్స్, టీపీబివోలు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా లాడ్జీలను, వాహనాలు తనిఖీలు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ అజితా వేజెండ్ల ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ సూచనలతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు గురువారం రాత్రి లాడ్జీలను, వాహనాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 31 లాడ్జిలను అందులో ప్రతి గదిని క్షుణంగా తనిఖీ చేశారు, రాత్రి వేళల్లో లాడ్జిలలో బస చేసే వ్యక్తులను ప్రశ్నిస్తూ వారి వివరాలు పై ఆరా తీశారు. అదేవిధంగా లాడ్జి పరిసరాలు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు, అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని, లాడ్జ్ నిర్వాహకులకు వారు సూచించారు. అదేవిధంగా అన్ని కూడళ్ళు, హైవే, ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాలలో విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు. క్షుణ్ణంగా వాహనాలు తనిఖీ చేసి, నేరపూరిత కార్యక్రమాలు జరగకుండా, అక్రమ రవాణా అడ్డుకట్టకు ముమ్మరంగా చర్యలు చేపట్టారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి, హెల్మెట్ ధరించాలి, లైసెన్స్ లేని, మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ వంటివి నిర్మూలించే విధంగా చర్యలు చేపట్టారు. అతివేగం, త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఆటో సైడ్ సిట్టింగ్, డిఫెక్టివ్ నెంబర్ ప్లేట్స్, అనధికార పార్కింగ్ మొదలైన ఉల్లంఘనకు నిర్మాణాలు విధించారు. అంతేకాకుండా జాతీయ రహదారిపై రాంగ్ రూట్ లలో వెళ్లవద్దని, గమ్యాలకు క్షేమంగా చేరాలని, ఇతరులకు, వాహనదారులకు ప్రాణ నష్టం జరగకుండా వారి ప్రాణాలను రక్షించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 1495 వాహనాలు తనిఖీ చేసి, ఓపెన్ డ్రింకింగ్ 10 కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ 9 కేసులు 9 మందిపై, రెండు వాహనాలు సీజ్, ఎంవి యాక్ట్ కేసులు 87 నమోదు చేసి 33,135/- రూపాయలు ఫైన్లు విధించారు.

## రంగనాథ స్వామికి చిత్రకూట ఉత్సవం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం రంగనాయకుల పేటలో వేంచేసియున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానం నందు శుక్రవారం రోజున తూర్పు రాజగోపుర నిర్మాణ కైంకర్యపరులు శ్రీ యరగుడిపాటి వెంకటాచలం పంతులు జయంతి సందర్భంగా ఉదయం 9.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి వారికి చిత్రకూట ఉత్సవం జరిగినది. ఈ కార్యక్రమమునకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## వీఎస్‌యూ పరిశోధన విద్యార్థికి డాక్టరేట్



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థిని ఆసిఫా తాజీంకి డాక్టరేట్ లభించింది. మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీకి చెందిన డాక్టర్ జె. విజేత మార్గదర్శకత్వంలో ఆమె "ఏ స్టడీ ఆన్ సోషల్ మీడియా మార్కెటింగ్ ఆన్ ఎలక్ట్రానిక్ గూడ్స్ కన్స్యూమర్స్ " అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఆమె పరిశోధనను అభినందించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ, విభాగాధిపతి డాక్టర్ జి. సాయి శ్రవంతి, అధ్యాపకులు ఆచార్య సుజా ఎస్. నాయర్, డాక్టర్ పి. చెంచురెడ్డి, గాయత్రి అనుపమ, డాక్టర్ పి. శ్రీవల్లి, డాక్టర్ ఎల్. అరుణ తదితరులు అభినందనలు తెలియజేశారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు వీబీఆర్‌కు ఆహ్వానం



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్ న్యూస్ :** నగరంలోని స్థానిక వెంకటేశ్వరపురం నందు వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డిని ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక గోమతి నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందించారు. ప్రతి ఏడాది స్వామివారి అనుగ్రహంతో అంగరంగ వైభవంగా జరిగే ఉత్సవాలకు హాజరుకావాలని నిర్వాహకులు విబిఆర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కాకర్లకు జన్మదిన శుభాకాంక్షలు : మాలేపాటి



**కావలి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన సందర్భంగా రాష్ట్ర ఆగ్రో చైర్మన్ మాలపాటి సుబ్బారాయుడు కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇలాంటి పుట్టినరోజులు సంతోషకరంగా మరెన్నో జరుపుకోవాలని వారు మనస్ఫూర్తిగా కోరుకున్నారు. అనంతరం రాజకీయ పరిస్థితుల గురించి కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రగ్స్ కేసులో ముగిసిన విచారణ

**22న ఉత్తర్వులు**

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** డ్రగ్స్ కేసులో బందీ అయిన నిడిగుంట అరుణ ను బెయిల్ పై విడుదల చేయాలా వద్దా అని నిర్ణయించేందుకు 1వ అదనపు జిల్లా జడ్జి బెయిల్ పిటిషన్ ను ఈ నెల 22కు వాయిదా వేశారు. అరుణ మాదక ద్రవ్యాల అక్రమ సరఫరాకు పాల్పడినారనే అభియోగంపై పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. ఈ కేసులో తనను బెయిల్ పై విడుదల చేయాలని కోరుతూ ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కాగా శుక్రవారం నాడు ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి తీర్పు చెప్పేందుకు సోమ వారానికి కేసు వాయిదా వేశారు.

# వైభవంగా ఖాజా నాయబ్ రసూల్ గంధమహోత్సవం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేట లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ వారి 252వ గంధ మహోత్సవం శుక్రవారం తెల్లవారు జామున అత్యంత వైభవంగా నిర్వహించారు. గంధ మహోత్సవమును మహల్ నుండి సుగంధ ద్రవ్యాలు పన్నీరుతో కలిపి గంధ కలశమును దర్గా వంశస్థుడు గంధం నిర్వాహకుడు ఎస్జిఎన్ ఫయాజ్ అహ్మద్ తలపై ఉంచుకొని దర్గా ఈవో షేక్ మొహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో మేళ తాళాలతో భక్తి కీర్తనలతో ఫకీర్ల జరాబులతో బాణాసంచా కాలుస్తూ హజరత్ నాయబ్ రసూల్ దర్గాకు చేర్చారు అక్కడ సమాధులకు గంధ లేపనం చేసి భక్తులకు గంధ ప్రసాదాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక సలాములు పాడి దువా చేశారు గంధమోత్సవాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు పాల్గొన్నారు రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో భక్తులకు గంధాన్ని ఏర్పాటు చేసి పంచిపెట్టారు. గంధమహోత్సవం సందర్భంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో ప్రత్యేక లైటింగ్ అన్నదానం బారికెట్లు షామియానాలు తదితర ఏర్పాట్లను చేశారు ఈ సందర్భంగా ఆత్మకూరు డిఎస్పి వేణుగోపాల్ సంఘం సీఐ వేమారెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్పేట ఎస్సై ఏ సైదులు డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

# సబ్సిడిలు అందుతాయా.. రుణాలు రద్దవుతాయా..

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపాలిటీలో, ఆత్మకూరు మండలంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, ఇతర కార్పోరేషన్ల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారి జీవనోపాధికోసం సబ్సిడితో రుణాలు మంజూరుచేసేలా ప్రభుత్వం నిర్ణయించగా అనేకమంది దరఖాస్తులు చేసుకోగా ప్రభుత్వం నుండి సబ్సిడి విడుదల కానందున ఎంపికైన వారికి ఈనాటికీ రుణాలు అందలేదు. ప్రభుత్వం నుండి సబ్సిడిలు విడుదలవుతాయా లేక రుణాలు రద్దవుతాయా అని చర్చించుకుంటున్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం వివిద కార్పోరేషన్లనుండి సబ్సిడి రుణాలకు దరఖాస్తులు స్వీకరించి ఇంటర్వ్యులు నిర్వహించి ఈరుణాలనే రద్దు చేశారు. ఈదపా కూడా అలా జరుగుతుందా అనే సందేహం పలువురిలో వ్యక్తమవుతోంది. ఈఏడాది జనవరిలో అధికసంఖ్యలో స్వయం ఉపాధికోరే యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో అన్ని ధృవీకరణలతో దరఖాస్తులు చేయగా వారికి ఇంటర్వ్యులు కూడా నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన కార్పోరేషన్‌వారీగా లక్ష్యంమేరకు ఈ దరఖాస్తుదారులనుండి ఎంపికచేసి ఆయా బ్యాంకులకు పంపారు. అయితే ప్రభుత్వం నుండి బ్యాంకులకు సబ్సిడి నిధులు విడుదల కాలేదు. దాంతో బ్యాంకర్లు రుణాలను లబ్దిదారులకు మంజూరుచేయడం లేదు. ప్రభుత్వం నిర్ధేశించిన రుణం మొత్తంలో 50శాతం సబ్సిడిగా విడుదలచేయాల్సి ఉంది. కానీ ఎనిమిదినెలలు గడిచినా ఇంకా ప్రభుత్వం నుండి బ్యాంకులకు సబ్సిడి నిధులు విడుదల కాలేదు. ఆత్మకూరు మండలంలో 46మందికి 50శాతం సబ్సిడితో బ్యాంకులనుండి రుణాలు పొందేందుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించి ఆదేవాలివ్వగా అధికారులు దరఖాస్తులు స్వీకరించి ఇంటర్వ్యులు నిర్వహించి అర్హులను ఎంపికచేశారు. ఆత్మకూరు రూరల్ మండలంలో 3రకాలుగా 2లక్షలు నుండి 5లక్షలవరకు ఈరుణాలుంటాయని, బిసి కార్పోరేషన్‌ద్వారా 30మందికి, బ్రాహ్మణకార్పోరేషన్‌ద్వారా ఒక్కరికి, రెడ్డికార్పోరేషన్ ద్వారా ముగ్గురికి, ఇబిసి కార్పోరేషన్ ద్వారా ఇద్దరికి, కమ్మకార్పోరేషన్ ద్వారా ఇద్దరికి, ఆర్యవైశ్యకార్పోరేషన్ ద్వారా ఒక్కరికి, చంద్రన్న స్వయంఉపాధి పథకంద్వారా కాపులు 5మందికి, మరియు జనరిక్‌మందులషాపు ఏర్పాటుకు కమ్మకార్పోరేషన్ ద్వారా ఒక్కరికి, ఆర్యవైశ్యకార్పోరేషన్ ద్వారా ఒక్కరికి సబ్సిడితో బ్యాంకులనుండి రుణాలు మంజూరవుతాయని ప్రభుత్వం నుండి ఆదేశాలందాయి. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో బిసికార్పోరేషన్ ద్వారా 41మందికి, కాపు కార్పోరేషన్ ద్వారా నలుగురికి, ఆర్యవైశ్యకార్పోరేషన్‌ద్వారా ఒక్కరికి, క్షత్రియకార్పోరేషన్ ద్వారా ఒక్కరికి మొత్తం 47మందికి రుణలిచ్చేలా ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించారు. ఆమేరకు మండలంలో ఎండివో, మున్సిపాలిటీలో కమీషనర్‌లు అన్నిబ్యాంకుల ప్రతినిధులతో అభ్యర్ధులకు ఇంటర్వ్యులు నిర్వహించి అర్హులను ఎంపికచేసి ఆయా బ్యాంకులకు వారి దరఖాస్తులను పంపారు. అయితే ప్రభుత్వం ఇప్పటివరకు సబ్సిడిని విడుదల చేయనందున నెలలతరబడి జాప్యం జరుగుతుండగా రుణాలకు ఎంపికైన వారు ఆతృతగా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇంకా జాప్యం జరుగుతుందా లేక గతంలోలాగా రద్దవుతాయా అని వారంతా చర్చించుకుంటున్నారు. గతంలో తెలుగుదేశం హయాంలో ఇలాగే కార్పోరేషన్‌లద్వారా సబ్సిడి రుణాలకు దరఖాస్తులు, ఇంటర్వ్యులు నిర్వహించి లబ్దిదారులను ఎంపికచేయగా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చి ఆరుణాలన్నింటిని రద్దుచేశారు. ఇక ఐదేళ్ళు కార్పోరేషన్‌రునాల ఊపే లేదు. కాగా ఈదపా తెలుగుదేశం ప్రభుత్వం రావడం, కార్పోరేషన్‌రుణాలు పునరుద్దరించడం, ఆమేరకు దరఖాస్తులు, ఇంటర్వ్యులు, ఎంపికల ప్రక్రియ పూర్తికాగా ప్రభుత్వం సబ్సిడి విడుదల చేయనందున రుణాల మంజూరు నిలిచిపోయిఉంది. ప్రభుత్వం వెంటనే పరిశీలించి సబ్సిడి విడుదల చేయాలని లబ్దిదారులుగా ఎంపికైనవారు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## మహిళల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



**బోగోలు, మేజర్‌న్యూస్ :** మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం అంతా బాగుంటదని బోగోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం బోగోలు మేజర్ పంచాయతీలోని చెంచులక్ష్మీపురం సచివాలయం-3 నిర్వహించారు. ఈ సందర్భంగా కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ మహిళలకు నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులకి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. 5 సంవత్సరాల లోపు పిల్లలకి వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగింది అని,గర్భవతులకు పౌష్టికాహారం గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగులవరం వ్యవసాయ సహకార సంఘం సొసైటీ చైర్మన్ చిలకపాటి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు లక్కాకుల మాధవరావు, వాయిల సుధాకర్, టీడీపీ సీనియర్ నాయకులు పులి. వెంకట స్వామి, గనిపినేని నాగరాజు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నజీమున్నిసా, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, 104 సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## వెంకటాచలంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి సెక్టార్ పరిధిలోని ఇడిమేపల్లి సచివాలయం రామదాసు కండ్రిగ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాలు, పౌష్టికాహారం వారోత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ లో సూపర్వైజర్ పద్మజ, అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు. సూపర్వైజర్ పద్మజ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే గంట లోపు తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది' అని పేర్కొన్నారు.

### స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్

# కార్యక్రమాన్ని నిర్వహించాలి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని సచివాలయాల్లో ఆరోగ్యకరమైన మహిళలు బలమైన కుటుంబాలుగా చేయ్యాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి బి.సుజాత తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాలికలు, పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత లేకుండా ఐరన్ మాత్రలు ఇచ్చి, పోషకాహారం గురించి, విద్య గురించి తెలపాలని సూచించారు. కొత్తగా గర్భవతులను నమోదు చేసి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల యందు జరిగే విధంగా ప్రణాళిక చెయ్యాలని కోరారు. ప్రమాదకర గర్భవతులను గుర్తించి వారికి సులభంగా ప్రసవం జరిగే విధంగా చెయ్యాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి చికిత్స అందించాలని తెలిపారు. కుటుంబ నియంత్రణ, మలేరియా, డెంగ్యూ వ్యాధుల నియంత్రణ గురించి వివరించారు. ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల గ్రామాల యందు వార్డుల యందు విలేజ్ హెల్త్ శానిటేషన్ న్యూట్రిషన్ డే ప్రతి 15 రోజులకు ఒకసారి జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ - ఆశా యాప్, యూవిన్‌యాప్‌లో ప్రతిరోజు అప్లోడ్ చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ ఎస్‌కెఖాదర్ వలీ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ఎ.ఉమామహేశ్వరి, జిల్లా మలేరియా అధికారిని హుస్సేనమ్మ, నరసింహారావు, డిపిఓ రమేష్, డీసీఎం సునీత, ఆశ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## సాగరంలో స్వచ్ఛత హి సేవ



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం గ్రామ పంచాయతీలోని. గుంత బజార్లోని ఉర్దూ పాఠశాలలో శుక్రవారం 'స్వచ్ఛత హి సేవ' జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి పాఠశాలను సందర్శించారు. ఎంపీడీవో పాఠశాల విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నిర్వహణను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్‌అంగన్వాడి స్కూల్ పిల్లలకు తల్లిదండ్రులకు ఆరోగ్య సంబంధమైన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోవైద్య ఆరోగ్య సిబ్బంది, డిప్యూటీ ఎంపీడీవో, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శి కార్యదర్శి, స్వచ్ఛభారత్ ఎంఆర్సి అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాలు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వి శ్రీ కావ్య అన్నారు శుక్రవారం మండలంలోని వావింటపర్తి సచివాలయంలో 'స్వస్థ్- నారీ- స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీ కావ్య మాట్లాడాతూ.. మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని, ప్రజలు ఈ ఆవకాశాని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మహిళలకు గుండెజబ్బులు, నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌లకు పరీక్షలు, కిశోరబాలికలు, గర్భిణులకు, పిల్లలకు వివిధ పరీక్షలు చేయటంతోపాటు అవసరమైన చికిత్సలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెట్టెం పెంచాలయ్య,ఎంఎల్ హెచ్పీ మెర్సీ స్వరూప, అమల, ఏఎన్ఎం వై.ప్రసన్న, మాధవి అంకమ్మ, రత్నకుమారి ఆశా కార్యకర్తలు పెంచలమ్మ, సుమతి అంగన్వాడి సూపర్వైజర్ జ్యోతిలక్ష్మి అంగన్వాడి వర్కర్ పద్మమ్మ, ఉషా, శ్రీదేవి పాల్గొన్నారు.